ప్రజాశక్తి
శనివారం 02 నవంబర్ 2024
5
కర్నూలు

దీపం-2 పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి టిజి.భరత్

రూ.2800 కోట్లతో ఓర్వకల్
పారిశ్రామిక వాడ అభివృద్ధి

- దీపం 2 పథకం ప్రారంభంలో మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2800 కోట్లతో ఓర్వకల్ పారిశ్రామిక వాడను అభివృద్ధి చేయనున్నట్లు పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో దీపం పథకం-2 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా మంత్రి టిజి. భరత్ , కర్నూలు ఎంపీ బస్తి పాటి నాగరాజు, జాయింట్ కలెక్టర్ బి.నవ్య పాల్గొన్నారు. మంత్రి టిజి. భరత్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా దీపం-2 పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పారు. అధికారంలోకి రాగానే 5 ఏళ్లలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలి, 2047 నాటికి రాష్ట్ర ఏ విధంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనలతో ముందడుగు వేస్తున్నామన్నారు. కర్నూలు ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన 4 లక్షల 72 వేల 851 మందికి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు గ్యాస్ పంపిణీ చేయనున్న ఉచిత గ్యాస్ పంపిణీ వాహనాన్ని మంత్రి జెండా ఊపి ప్రారంభించి, నేరుగా బుధవారపేటలోని ఉచిత గ్యాస్ లబ్దిదారులైనా లక్ష్మీదేవి, దేవిక ఇంటి వద్దకే స్వయంగా వెళ్లి గ్యాస్ సిలిండర్లను మంత్రి, ఎంపీ, జాయింట్ కలెక్టర్ లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టేట్ సివిల్ సప్లయ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కర్నూలు ఆర్డిఒ సందీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, డిఎస్ఒ రాజరఘువీర్, మెప్మా పిడి నాగశివలీల, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

డబ్బు కొట్టు... కాపీ కొట్టు...

●ఎఎన్‌యు ఓపెన్ డిగ్రీ పరీక్షల్లో జోరుగా చూచిరాతలు

●పట్టించుకోని అధికారులు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య ద్వారా నిర్వహిస్తున్న ఓపెన్ డిగ్రీ పరీక్షల్లో వ్యవహారం అంతా ఓపెన్ అయిపోంది. జోరుగా చూచిరాతలు సాగుతున్నాయి. డబ్బు కొట్టి యథేచ్ఛగా కాపీ కొట్టు అన్న విధంగా తయారైంది. యూనివర్సిటీ అధికారులు గుంటూరులో ఉండటం, పరీక్షలు జరుగుతునన తీరును పట్టించుకోకపోవడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో చూచిరాతలను అడ్డుకునేవారు లేకుండా పోయారు..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

'మీకు డిగ్రీ సర్టిఫికెట్ కావాలా! అయితే, మా సెంటర్లో చేరండి.. కచ్చితంగా పాస్' తరహా పకటనలతో దూరవిద్య కేంద్రాలు డబ్బు పోగేసుకుంటున్నాయి. జిల్లాలో నాగార్జున యూనివర్సిటీ దూర విద్య పరీక్షలు అక్టోబర్ 27తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. సుమారు 2500 మంది విద్యార్థుల వరకూ పరీక్షలకు హాజరవుతున్నారు. అయితే, పరీక్షల్లో పాస్ చేస్తామని ముందుగానే అడ్మిషన్లు తీసుకున్న సెంటర్లు పరీక్షల సమయంలో పుస్తకాలు పెట్టి మరీ పరీక్షలు రాపిస్తామంటూ అదనంగా ఒక్కో విద్యార్థి నుంచి సగటున రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ వసూలు చేశారు. ఈ విధంగా వసూలు చేసి ఇందులో యూనివర్సిటీ అధికారులకు కూడా మామూళ్లు ఇచ్చి ఇష్టారాజ్యంగా పరీక్షలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఎఎన్‌యు అనుబంధంగా కర్నూలు, నంద్యాల, కోడుమూరులో కలిపి మొత్తం 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముందుగానే ఆయా సెంటర్లలో ఎవరు కూడా నేరుగా రాకుండా గేట్లు వేసి మరీ పరీక్షలు కొనసాగిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా వస్తున్నట్టు తెలిస్తే లోపల ఉన్న వారిని అలర్ట్ చేస్తున్నారు. తద్వారా ఆ సమయంలో కాపీయింగ్ జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. ఆ తర్వాత యథావిధిగా తమ పని కానిస్తున్నారు. మొత్తంగా దూరవిద్య పేరుతో కొన్ని సెంటర్లు డబ్బుల దందాకు తెరలేసి చదువుకు మరీ విలువ లేకుండా చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ.50 లక్షలకు పైమాటే..

జిల్లాలో మొత్తం 2500 మంది వరకూ ఎఎన్‌యు దూర విద్యకు హాజరవుతున్నారు. వీరికి కనీసం పుస్తకాలు కూడా సకాలంలో అందించలేదు. దీంతో పరీక్షకు ఎవ్వరూ సిద్ధమయ్యే పరిస్థితి లేదు. తీరా పరీక్షలు వచ్చిన తర్వాత ఇప్పుడు పరీక్షల్లో పాసు కావాలన్నా చూసి రాయలన్నా ఒక్కో విద్యార్థి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ ఇవ్వాలని సదరు దూరవిద్య కేంద్రాల నిర్వాహకులు తేల్చి చెబుతున్నారు. ఫలితంగా జిల్లాలో పరీక్షలు రాస్తున్న 3 వేల మంది విద్యార్థులు కాస్తా రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ చెల్లించాల్సి వచ్చింది. ఒకవేళ ఎవరైనా డబ్బులు ఇవ్వకపోతే వారు చూచి రాసేందుకు అనుమతించడం లేదు. అంతేకాకుండా ప్రత్యేకంగా పక్కన కూర్చోబెట్టి చూసిరాసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా 3 వేల మంది విద్యార్థుల నుంచి రూ.2 వేల నుంచి రూ.3 వేల చొప్పున లెక్కిస్తే రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకూ వసూలు చేసినట్టు సమాచారం. అభ్యర్థి కాకుండా వేరే వారితో పరీక్ష రాయిస్తే దానికి అదనంగా రూ.5వేల నుంచి రూ.6వేలు వసూలు చేస్తున్నారు. ఇందులో యూనివర్సిటీ దూరవిద్య అధికారులకు కూడా భారీగానే ముట్టచెబుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

యూనివర్సిటీ పరిశీలకులు ఎక్కడ?

వాస్తవానికి దూరవిద్య పరీక్షలు జరిగే సమయంలో సదరు యూనివర్సిటీకి చెందిన సిబ్బంది పరిశీలకులుగా వస్తారు. పరీక్షలు జరిగే సమయంలో అక్కడే మకాం వేసి కట్టుదిట్టంగా పరీక్షలు జరిగేలా చూడాలి. ఎఎన్ఐయూ దూర విద్యలో మాత్రం ఈ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. యూనివర్సిటీ నుంచి వచ్చిన పరిశీలకులు ఎక్కడా కనిపించని పరిస్థితి. కనీసం సెంటర్ల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం.

సెంటర్లను రద్దు చేయాలి

నాగార్జున ఓపెన్ యూనివర్సిటీ ద్వారా విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల నుండి పరీక్షలు ఉన్న ప్రతిసారి పరీక్ష కేంద్రాల నిర్వాహకులు కాపీలు కొట్టించడానికి ప్రతి విద్యార్థి నుండి రూ.2వేల నుండి రూ.3వేల వరకు, ఇతరులు పరీక్షలు రాయడానికి రూ.5వేల నుండి రూ.6వేల వరకు వసూలు చేస్తున్నారు. అన్ని సెంటర్లలో ఇదే మాదిరి డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా కేంద్రం కోఆర్డినేటర్ పరీక్ష కేంద్రాల నిర్వాహకుల దగ్గర ప్రతి పరీక్షా సమయంలో రూ.50వేలు, నూతనంగా దూరవిద్య కేంద్రాలను నడుపుకోవాలంటే రూ.రెండు లక్షల నుండి రూ.మూడు లక్షలు తీసుకొని ఎన్ని ఫిర్యాదులు వచ్చినా, గూడూరులో బదులు కోడుమూరులో పరీక్షలు రాయిస్తున్నా, విద్యార్థి కాకుండా పక్కన వాళ్ళు రాస్తున్న ఫోటోలు, వీడియోలు సంబంధిత యూనివర్సిటీ అధికారులకు పంపినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మాస్ కాపీయింగ్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న కేంద్రాలను రద్దు చేయాలి. ఈ కేంద్రాలను పర్యవేక్షిస్తున్న కోఆర్డినేటర్‌పై చర్యలు తీసుకోవాలి.

- నగేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

చర్యలు తీసుకుంటాం..

ఎఎన్‌యు దూరవిద్య పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్‌కు పాల్పడినా, కాపీయింగ్‌కు ప్రోత్సహించినా చర్యలు తీసుకుంటాం. కాపీయింగ్ జరుగుతున్నట్లు తేలితే పరీక్షా కేంద్రాలను మారుస్తాం.

- వి.వెంకటేశ్వర్లు, ఎఎన్‌యు దూరవిద్య డైరెక్టర్.

ఘనంగా డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

- పలుచోట్ల జెండావిష్కరణలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని సుందరయ్య జంక్షన్‌లో డివైఎఫ్ఐ నాయకులు శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ డివైఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. రెవెన్యూ కాలనీలో న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్ బాష పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ మాజీ నాయకులు పిఎస్ రాధాకృష్ణ, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్రఉపాధ్యక్షులు వెంకటస్వామి మాట్లాడారు. 1980 సంవత్సరంలో పంజాబ్ రాష్ట్రంలోని లుధియానా నగరంలో 'అందరికీ విద్య - అందరికీ ఉపాధి' అనే నినాదంతో ఆర్థిక , సామాజిక, లింగ వివక్షతలకు వ్యతిరేకంగా స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో పనిచేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్యను ఏర్పాటు చేశారని తెలిపారు. నాటినుండి నేటి వరకు అనేక ఉద్యమాలు పోరాటాలు సేవా కార్యక్రమాలు నిర్వహించి దేశంలోని యువత మద్దతు పొందిన అతిపెద్ద యువజన సంఘంగా ఎదిగిందని తెలిపారు. నేడు మతోన్మాదంతో, సామ్రాజ్యవాదంతో దేశంలో నిరుద్యోగం భారీగా పెరిగి యువత పరిస్థితి దరిద్రంగా మారిందని తెలిపారు. యువతీయువకులందరూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ముఖ్యంగా అమెరికా ప్రోత్బలంతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఖండించాలన్నారు. క్యూబా పై అమెరికా ఆర్థిక నిర్బంధాన్ని ఎత్తివేయటానికి పోరాటం చేయాలన్నారు. దేశంలో ఉన్న పరిశ్రమలన్నింటినీ మూసేసి యువతకు ఉపాధి లేకుండా చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల పైన వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా, యువతకు ఉపాధి లేకుండా తక్కువ వేతనానికే ఎక్కువ పని చేయించుకునే దుర్మార్గానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. డివైఎఫ్ఐని మరింత బలోపేతం చేయాలని, అప్పుడే నేటి యువతకు విద్యా ఉపాధి ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. 'నిరుద్యోగం అంతం డివైఎఫ్ఐ పంతం. డ్రగ్స్ అంతం డివైఎఫ్ఐ పంతం' అనే నినాదంతో పనిచేయాలన్నారు. డివైఎఫ్ఐ జిల్లా నాయకులు శిరీష, నగర ఉపాధ్యక్షులు విక్రమ్, సహాయ కార్యదర్శి ఇమ్రాన్ నాయకులు రాఖీ మల్లేష్, సర్ఫరాజ్, శివకృష్ణ, మౌలాలి మాజీ నాయకులు మాలిక్, సిఐటియు ఆటో యూనియన్ జిల్లా నాయకులు రాధాకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ మాజీ నాయకులు రాధాకృష్ణ

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం : ఎస్పి

- పోలీసుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

- పోలీసు అమరులకు స్మారక చిహ్నం వద్ద నివాళులు

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పి, పోలీసులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులకు నివాళులర్పించడం జరిగిందని, పోలీసు అమరవీరుల త్యాగాలను మరవలేనివని జిల్లా ఎస్పి జి. బిందు మాధవ్ అన్నారు. గురువారం రాత్రి కర్నూలు పట్టణంలో పోలీసు అమరవీరులను స్మరిస్తూ కర్నూలు పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. పోలీసు అమరవీరులను స్మరిస్తూ పోలీసు కార్యాలయంలోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులను ఉంచి పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో ఉన్న అమరవీరుల స్థూపం నుండి కర్నూలు కొండారెడ్డి బురుజు మీదుగా పెద్ద మార్కెట్ రోడ్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు పోలీసు బ్యాండ్ మధ్య పోలీసు అధికారులు సిబ్బంది, కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఎస్పి జి. బిందు మాధవ్ మాట్లాడుతూ అమరులైన పోలీసు త్యాగాలను మనమందరం గుర్తు చేసుకుంటూ కొవ్వొత్తుల ప్రదర్శన చేశామన్నారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఈనెల 21 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు పోలీసులు చేపట్టారన్నారు. పోలీసు అమరవీరులకు జోహార్లు అర్పించామన్నారు. హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, ఎఆర్ అడిషనల్ ఎస్పి కృష్ణమోహన్, డిఎస్పిలు, సిఐలు,ఆర్ ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములుకు నివాళ్లు అర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ బి నవ్య, తదతరులు

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

జాయింట్ కలెక్టర్ బి నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య కొనియాడారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, కర్నూలు కమిషనర్ రవీంద్రబాబు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, బిసి. వెల్ఫేర్ అధికారిని వెంకట లక్ష్మమ్మ , పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

పొట్టి శ్రీరాములుకు నివాళ్లు అర్పిస్తున్న పిబివి.సుబ్బయ్య, ఉపాధ్యాకులు, విద్యార్థులు

సాయిసుబ్బయ్య రవీంద్ర విద్యాసంస్థలలో ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మాధవినగర్‌లో రవీంద్ర ఇంగ్లీషు మీడియం స్కూలు , రెవెన్యూకాలనీలో రవీంద్ర టాలెంట్ స్కూల్స్‌లో కరస్పాండెంట్ పిబివి.సుబ్బయ్య ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ పిబివి.సుబ్బయ్య మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలర్పించిన మహనీయులు పొట్టి శ్రీరాములు అని, ఆ మహనీయున్ని స్మరించుకుంటూ ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆ మహనీయుడు చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం శ్రీ పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19న మద్రాసులో ఆమరణ నిరహార దీక్ష చేస్తూ, 58 రోజుల దీక్ష తర్వాత, అంటే డిసెంబర్ 15న తుది శ్వాస విడిచారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించడంతో 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ శారదదేవి, కో-ఆర్డినేటర్స్ అక్తర్‌బేగం, సుభద్ర, బాలు, నాగేంద్ర, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం, ఆనందం

-మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

-డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ క్రీడా సంబరాల్లో తాలుకా సిఐ శ్రీధర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఆటల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యం, ఆనందం లభిస్తుందని కర్నూలు తాలూకా సిఐ శ్రీధర్ అన్నారు. శుక్రవారం డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన క్రీడా సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన స్వయంగా బౌలింగ్, బ్యాటింగ్ చేసి యువతలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే యువకుల నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఆటల పోటీలు దోహదపడతాయని అన్నారు. ఆటల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక ధృఢత్వం పెరుగుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి, యువకుడు ఆటల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. దాని ద్వారా ఏ ఇతర అలవాట్లకు గురికాకుండా ఉంటారని సూచించారు. మత్తు పదార్థాల నియంత్రణ కోసం పోలీస్ డిపార్టుమెంట్ బాగా కృషి చేస్తుందని, ఎక్కడా అలాంటివి తమ దృష్టికి వచ్చినా, ఎలాంటి వారి ప్రమేయం అందులో ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదని అన్నారు. ప్రభుత్వ సహకారంతో డ్రగ్స్ నిర్మూలన కోసం కృషి చేస్తామన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర మాట్లాడుతూ నేడు రాష్ట్రం మొత్తం డ్రగ్స్ విలయతాండవం చేస్తోందని విమర్శించారు. ఒకప్పుడు పెద్ద పెద్ద నగరాలలో దొరికే డ్రగ్స్ నేడు పల్లెల్లో కూడా విస్తరించే పరిస్థితి దాపురించిందని అన్నారు. విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున మత్తు పదార్థాలకు బానిసలువుతున్న పరిస్థితి ఉందని అన్నారు. ప్రభుత్వం మత్తు పదార్థాలను డ్రగ్స్‌ను నియంత్రించాలని కోరారు. అంతకు ముందు డివైఎఫ్ఐ జెండాను రాఘవేంద్ర ఆవిష్కరించారు. డివైఎఫ్ఐ జిల్లా నాయకులు అబ్దుల్లా, ప్రకాష్, మండల నాయకులు సురేష్, అంజి, దివాకర్, గ్రామ నాయకులు రాము, శ్రీను, రఘువరన్, శివ, హరిబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రారంభించి మాట్లాడుతున్న తాలూకా సిఐ శ్రీధర్

6న కలెక్టరేట్ ముందు ఆటో కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెల 6న కలెక్టరేట్ జరిగే ధర్నాకు ఆటో కార్మికులు భారీ ఎత్తున రావాలని ఆటో యూనియన్ నగర సహాయ కార్యదర్శి వెంకటేష్ కోరారు. కర్నూలు నగరంలో గురువారం జ్యోతి మాల్ ఆటో స్టాండ్ దగ్గర కె.వెంకటేష్ అధ్యక్షతన ఆటో స్టాండ్ కార్మికులు నిరసన తెలిపారు. ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి మెహమూద్, సిఐటియు నగర నాయకులు మాట్లాడుతూ ఫిట్నెస్ సర్టిఫికేట్ డ్రైవింగ్ లైసెన్సులు ప్రైవేటు సంస్థలకు కేంద్ర ప్రభుత్వం జూన్ 1 నుంచి ప్రైవేట్ సంస్థల్లో ఫిట్నెస్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసేలా కొత్త రూల్స్ తీసుకురావడం సమంజసం కాదని ఈ ప్రక్రియను తక్షణమే ఆపి యథావిధిగా ఆర్‌టిఎ కార్యాలయంలోని ఫిట్నెస్ సర్టిఫికేట్ డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ సంస్థల ఫిట్నెస్ సర్టిఫికెట్ డ్రైవింగ్ టెస్ట్ కేంద్రాల్లో ఫిట్నెస్ సర్టిఫికేట్ డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన టెస్టులను ప్రైవేటు వారే నిర్వహించి లైసెన్సులు ఇవ్వచ్చు అన్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వారు తప్పు పట్టారు. ఎందుకంటే దీనివల్ల ప్రైవేటు సంస్థలు తమ ఇష్టానుసారంగా వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తారన్నారు. డ్రైవింగ్ సరిగా రాని వారికి కూడా డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసి ప్రమాదాలకు కారణం అవుతారని దీనివల్ల ప్రజలు నష్టపోతారని వారన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. రాపిడ్ అప్‌లో టు వీలర్ రైడర్ కు ప్రభుత్వం ఎలా అనుతిస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. టూవీలర్ రైడను తక్షణమే రద్దు చేయాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో కార్మికులకు బ్యాడ్జి నెంబర్‌తో నిమిత్తం లేకుండా వాహన మిత్ర చేయాలని కోరారు. ఈనెల 6న కలెక్టరేట్ జరిగే ధర్నాకు ప్రతి ఆటో కార్మికుడు హాజరు కావాలని ఆటో కార్మికులకు పిలుపునిచ్చారు. జ్యోతి స్టాండ్ ఆటో కార్మికులు చంద్రశేఖర్, బురాన్, షఫీ, ఆనంద్, ఎల్లప్ప, కార్మికులు పాల్గొన్నారు.

సమాజ సేవకు అంకితం కావాలి

యుటిఎఫ్ నేత జయరాజుకు ఘనంగా సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగ విరమణ పొందిన అనంతరం ప్రతి ఒక్కరు సమాజ సేవకు అంకితం కావాలని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. కర్నూలు రూరల్ మండలంలోని అంబేద్కర్ నగర్ ఎంపిపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ,యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎస్ఎం జయరాజు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి,
సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయి, ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయ రాజు, అప్ట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాశరావు, ఎస్టియు జిల్లా అధ్యక్షుడు గోకారి, ఎంఇఒ లు వినోద్ కుమార్, విజయ్ కుమారి, శ్రీనివాసులు, నాగరాజు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమంలో జయరాజు ఎన్నో సంవత్సరాలపాటు సేవలందించారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా యధావిధిగా తన సేవలను కొనసాగించాలని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జయరాజు దంపతులను ఘనంగా శాలువా పూలమాలలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు. ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగరమోహన్, నంద్యాల యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు, జిల్లా జిల్లా గౌరవ అధ్యక్షుడు దావీదు ,సహాధ్యక్షుడు హేమంత్ కుమార్ ఆర్థిక కార్యదర్శి యెహోషువ, జిల్లా కార్యదర్శులు ఇబ్రహీం, నరసింహ, దేవ పాల్ రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప ,రాష్ట్ర నాయకులు నాగమణి, జెవివి జిల్లా అధ్యక్షుడు సుధీర్ రాజు, ఆయా మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో పాటు పలువురు పాల్గొన్నారు.

జయరాజును సన్మానిస్తున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

నాతోస్నేహం చెయ్యవూ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, విద్యార్థులు

నాతో స్నేహం చెయ్యవూ... పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

కర్నూలు బిర్లా కాంపౌండ్‌లో రాజస్థాన్ కోట వారి శాఖ మోషన్ జూనియర్ కళాశాలలో నేడు డాక్టర్ బివి. స్వరూప్ సిన్హా కథా సంపుటి 'నాతో స్నేహం చెయ్యవూ' పుస్తకావిష్కరణ ఘనంగా నిర్వహించారు. సిన్హా ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా నిర్వహించిన తెలుగు తోరణం కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొని తెలుగుభాష గొప్పదనం గురించి, కవులు, రచయితల గురించి ప్రసంగించారు. ముఖ్య అతిధి ఉస్మానియా కళాశాల తెలుగు ప్రొఫెసర్ మండి అన్వర్‌హుస్సేన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మాతృభాషను మరచి పోవడం అంటే తలిదండ్రులను మరచి పోవడమే అన్నారు. సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి రచయిత జంధ్యాల రఘు బాబు, సభాధ్యక్షులుగా తెలుగు పండితులు ప్రతాప రెడ్డి పుస్తక సమీక్ష చేశారు. డా సిన్హా సైన్స్ అధ్యాపకులయినా, తెలుగు సాహిత్యం పై మిక్కిలి ప్రేమ గలవారని అన్నారు. చిన్న నాటి నుండి సాహిత్యం, సంగీతం, చిత్ర లేఖనంలో పట్టు సాధించి, ఈ ఏడవ రచనను వెలుగు లోకి తెచ్చారని ప్రశంసించారు. రచయిత సిన్హా స్పందిస్తూ నేటి యువతలో పుస్తక పఠనం ప్రోత్సహించాలన్నారు. తమ విద్యార్థులలో చదివే ఆసక్తి ఉందని తన కథలకు మంచి స్పందన వస్తుందని అన్నారు. పుస్తకాన్ని అందుకే తన విద్యార్థులకు అంకితమిచ్చానన్నారు. ప్రిన్సిపల్ అంజద్ ఖాన్, ఉపన్యాసకులు లక్ష్మీ నారాయణ, రాకీకుమార్, కుమార్ లు రచయితకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సన్మాన కార్యక్రమంతో కార్యక్రమం ముగిసింది.

తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించాలి

కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి -తుగ్గలి



తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగార్జున అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం జిల్లాలో రెండు మండలాలు కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకున్నాయని అన్నారు. గతంలో కూడా తుగ్గలి మండలం కరువు మండలంగా ప్రకటించకపోవడంతో చాలామంది బతుకు తెరువు కోసం సూదూర ప్రాంతాలకు వలస వెళ్లవలసిన పరిస్థితి ఈ మండలాలలో ఏర్పడిందన్నారు. తీవ్ర వర్ష భావ పరిస్థితి అప్పుడు ఉన్నప్పటికీ అప్పుడున్న ప్రభుత్వం తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించలేదన్నారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఏర్పడడంతో రైతులు తీవ్ర ఆందోళనలకు గురి అవుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని నాగార్జున డిమాండ్ చేశారు.

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న నాయకులు

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు..?

- డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్
- ఘనంగా డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబును డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ ప్రశ్నించారు. శుక్రవారం డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీ, ఎస్సీ కాలనీలో డివైఎఫ్ఐ జెండాను ఎగురవేశారు. డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు మహేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సురేష్, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడుగు, బలహీన వర్గాలకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు భృతి రూ.3 వేలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీఇచ్చారని తెలిపారు. ఇప్పటిదాకా అమలు చేయలేదని, ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరులో చేనేత పరిశ్రమను పునరుద్ధరించాలని కోరారు. డివైఎఫ్ఐ నాయకులు ఉదయ్, భీమేష్, మోహిన్, గురు, కుమార్, రాజేష్, అభిషేక్, నరసింహ, నర్సప్ప పాల్గొన్నారు. **ఆదోని**లోని మండగిరి ప్రాంతంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులు మోహన్ జెండా ఎగుర వేశారు. డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్, సీనియర్ నాయకులు రామానాయుడు, నాయకులు భీమా నవీన్, సురేష్, రాఖీ, తిమ్మయ్య, వెంకట్, బాబా, చాంద్ బాషా, మహేష్, వంశీ, మహేష్, నవీన్ ఉన్నారు. **ఆదోని (రూరల్)** మండలం పాండవగల్‌లో డివైఎఫ్ఐ జెండాను మాజీ నాయకులు కె.పాండురంగ ఎగురవేశారు. సిఐటియు మండల అధ్యక్షులు రామాంజనేయులు, కార్యకర్తలు రామాంజనేయులు, దేవరాజు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం : ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - హాలహర్వి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

కార్యకర్తలే పార్టీకి బలమని, పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి తెలిపారు. గురువారం మండలంలోని క్షేత్రగుడిలో సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైఎస్.జగన్మోహన్ రెడ్డిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు ఎక్కువయ్యాయని, దాడులను అధిగమించేందుకు గ్రామ, మండల కమిటీలను ఎన్నుకోవాలని సూచించారు. వాలంటీర్ కంటే కార్యకర్తలే పార్టీకి బలమని తెలిపారు. వైస్ ఎంపిపి నాగేష్, కో కన్వీనర్ మల్లికార్జున, చింతకుంట సొసైటీ మాజీ ఛైర్మన్ సీనప్ప, జనార్ధన్ నాయుడు, తిప్పారెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

- ట్రాఫిక్ సిఐ సుబ్బారావు

ప్రజాశక్తి - ఆదోని

దుకాణదారులకు హెచ్చరికలు జారీ చేస్తున్న సిఐ

ప్రధాన రోడ్డులో దుకాణాలకు ముందు అక్రమంగా నిర్మాణాలు చేపట్టి వాహన రాకపోకలకు ఇబ్బంది కలిగించవద్దని ట్రాఫిక్ సిఐ గంటా సుబ్బారావు సూచించారు. శుక్రవారం పట్టణంలోని పోలీసు కంట్రోల్ రూమ్ నుంచి తిక్కస్వామి దర్గా వరకు దుకాణాల ముందు రోడ్డుకిరువైపులా ఉంచిన సామగ్రిని తొలగించారు. వాహనాలను తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. ఆర్ట్స్ కళాశాల రోడ్డు, మున్సిపల్ మెయిన్ రోడ్డు, ఝాన్సీ లక్ష్మీబాయి, గురజాల మార్కెట్ రోడ్డు, చిన్న మార్కెట్ రోడ్డుకు ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా దుకాణంలోని సామగ్రిని ఉంచి రోడ్డు ఇరుకుగా అయ్యేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ స్తంభించిపోతోందన్నారు. అక్రమంగా సామగ్రిని ఉంచ కుండా సహకరించాలని కోరారు.

దేవరగట్టు హుండీ రగడ

- హుండీపై 'రాజకీయ' కన్ను
- గుట్టుచప్పుడు కాకుండా హుండీ లెక్కింపు
- రూ.లక్షల్లో స్వాహా

ప్రజాశక్తి - హొళగుంద

దేవరగట్టు మాలమల్లేశ్వర దేవాలయ హుండీపై రగడ సాగుతోంది. ఆలయ హుండీపై రాజకీయ నాయకులు కన్నేశారు. దేవరగట్టు ఉత్సవాల నేపథ్యంలో కానుకల రూపంలో వచ్చిన లక్షలాది రూపాయలను స్వాహా చేసినట్లు బహిరంగంగా వినిపిస్తోంది.

శ్రీమాల మల్లేశ్వరస్వామి దేవాలయానికి గతంలో కమిటీ ఉండేది. ప్రస్తుతం కమిటీ లేకపోవడంతో దేవాలయంలో ఉండే హుండీలపై రాజకీయ నాయకులు కన్నేశారు. ఆలయంపై పట్టు కోసం ఏకంగా మాజీ మంత్రి, ప్రస్తుత గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ బహిరంగంగా రచ్చకెక్కించారు. ప్రస్తుత టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ ఓడిపోయారని, ఆయనకు ఇక్కడ ఎలాంటి హక్కులూ ఉండవని మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఇక్కడ భక్తులకు మౌలిక సౌకర్యాలు లేవు. దేవరగట్టును అభివృద్ధి చేయాలనే ఆలోచన ఏ ఒక్కరికీ లేదు. ఇరువురూ తమ తమ గ్రూపులను రంగంలోకి దింపి దేవరగట్టు ఆలయంపై పట్టు కోసం పోటీపడ్డారు. దసరా ఉత్సవాల సందర్భంగా దేవరగట్టు ఐదు రోజులపాటు జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు భక్తులు భారీగా తరలివస్తారు. బన్ని ఉత్సవం ఒక్క రోజే రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి లక్షల్లో భక్తులు తరలివస్తారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని హుండీలో కానుకలు వేస్తారు. కొంతమంది వెండి, బంగారు ఆభరణాలు కూడా వేస్తారు. ఇంత పెద్ద ఎత్తున భక్తులు కానుకలు వేయగా గురువారం సాయంత్రం గుట్టుచప్పుడు కాకుండా హుండీ లెక్కింపు చేపట్టారు. హుండీలో ఈ ఏడాది లెక్క తేలింది. రూ.3,89,440, ఒక వెండి గుర్రం, ఒక వెండి లింగం వచ్చినట్లు తెలిసింది. రాజకీయ నాయకులు, చుట్టుపక్కల గ్రామాలైన నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాల పెద్దమనుషులు వచ్చిన కానుకలను అప్పనంగా దోచుకున్నారు. ఆలయ కమిటీ లేకపోవడంతో ఎవరికి వారు ఇష్టారాజ్యంగా విరాళాలను దండుకున్నట్లు సమాచారం. ఇలాగే వదిలేస్తే అభివృద్ధి మాట పక్కనుంచితే దేవరగట్టు రాజకీయ నాయకుల కనుసన్నల్లో ఉండిపోవడమే కాకుండా భక్తులకు స్వేచ్ఛ కూడా కరువయ్యే ప్రమాదం ఉంది. దేవదాయ శాఖ అధికారులు స్పందించి దేవరగట్టు హుండీ కానుకలు పరులపాలు కాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

పిల్లలతో పని చేయిస్తే

ఎలా సారూ..?

ప్రజాశక్తి - ఆదోని రూరల్

దీపావళి పండగ సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ మైదానంలో బాణసంచా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దుకాణాల్లో ఒక ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు బాణసంచా కొన్నారు. సుమారు రెండు సంచుల్లో ఫ్యామిలీ ప్యాక్ బాణసంచాలు 20 కొన్నారు. మున్సిపల్ మైదానంలో దుకాణాలకు, పార్కింగ్‌కు కొంత దూరం ఉంది. పండగ సందర్భంగా పాఠశాలకు సెలవు ఉండడంతో బాణసంచా దుకాణాలను చూసేందుకు విద్యార్థులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. కొంత దూరం నడవడానికి పోలీసులు ఇష్టపడక అక్కడ ఉన్న పిల్లలను పిలిచారు. 'పిల్లలూ.. బాణసంచా సంచులు అక్కడ ఆటోలో పెట్టి రమ్మ'ని చెప్పారు. ముందు ఒక కానిస్టేబుల్, వెనకాల సంచులు పట్టుకుని పిల్లలు పోతున్న విధానాన్ని చూసి అక్కడున్న వారు ఆశ్చర్యానికి గురయ్యారు. 'సార్ పిల్లలతో పని చేయిస్తే ఎలా' అంటూ పట్టణ ప్రజలు చర్చించుకున్నారు. అక్కడే ఉన్న ప్రజాశక్తి విలేకరి ఫొటో 'క్లిక్'మనిపించారు. మరో కానిస్టేబుల్ దానికి గమనించి 'పోలీసులనే ఫొటో తీస్తావా' అంటూ కస్సుబుస్సులాడారు. 'వార్త రాయ్ చూస్తామ'ంటూ ఒక స్థాయిలో మరో కానిస్టేబుల్ విలేకరిపై విరుచుకుపడ్డారు.

పిల్లలతో బాణసంచా సంచులు మోయిస్తున్న పోలీసు

పిల్లలతో పని చేయించడం అన్యాయం

మున్సిపల్ మైదానంలో విద్యార్థులతో బాణసంచా సంచులు మోయించడం అన్యాయం. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాల్సిన పోలీసులే ఇలా ప్రవర్తించిన తీరు అన్యాయం. అలాంటి పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం

- పంచాయతీ కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి - చిప్పగిరి

నివాస ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు దరిచేరవని పంచాయతీ కార్యదర్శి సురేంద్ర సూచించారు. శుక్రవారం చిప్పగిరిలో పంచాయతీ కార్మికుల చేత ప్రతి వీధిలో కూడా పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వీధుల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తీయించి బ్లీచింగ్ పౌడర్, లిక్విడ్‌ను చల్లించామని తెలిపారు. మహిళలు కూడా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు రాకుండా చూసుకోవచ్చని సూచించారు. మహిళలు ఇంట్లో నుంచి వ్యర్థాలను బయట వేయకుండా చెత్తకుండీలో వేసే అలవాటు చేసుకోవాలన్నారు.

పారిశుధ్య పనులు చేపడుతున్న సిబ్బంది

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

ఉచిత గ్యాస్ పంపిణీ చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. శుక్రవారం దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసే బ్యాంకర్స్ కాలనీలోని ఇండేన్ గ్యాస్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆదోనిలో లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రక్రియ మొదలైందని తెలిపారు. పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహశీల్దార్ శివరాముడు, బిజెపి సీనియర్ నాయకులు విట్టా రమేష్, సిఎస్ డిటి వలీ, జనసేన నాయకులు రేణు వర్మ, బిజెపి నాయకులు నాగరాజ్ గౌడ్, ఆచారి, జనసేన నాయకులు పులి రాజు, వీరేష్, బల్లేకల్ రామాంజి ఉన్నారు. **మంత్రాలయం**లో హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి మాట్లాడారు. తహశీల్దార్ ఎస్.రవి, ఆర్ఐ ఆదాం, మాజీ జడ్‌పిటిసి ఆర్.లక్ష్మయ్య, టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ వరదరాజులు, అశోక్ రెడ్డి, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు షేక్ బీబీ జాను, షేక్ మహ్మద్ సలీం, డిసి తిమ్మప్ప, ఎంపిటిసి వెంకటేష్, విద్యాకమిటీ ఛైర్మన్ నరసింహ, మేకల నరసింహ, రాజన్న, రాఘవేంద్ర, భీమన్న, దాసు పాల్గొన్నారు. **కౌతాళం**లో టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి ఆదేశాల మేరకు మహిళలకు ఉచిత గ్యాస్‌ను టిడిపి సీనియర్ నాయకులు చెన్న బసప్ప అందజేశారు. తహశీల్దార్ మల్లికార్జున స్వామి, ఎంపిడిఒ సుబ్బరాజు, టిడిపి నాయకులు కొట్రేష్ గౌడ్, రమేష్ గౌడ్, సిద్ధు, రాజబాబు, శివప్ప గౌడ్, నరసింహులు, భీమయ్య, రేవన్న, నాగప్ప, జనసేన మండల నాయకులు రాంబాబు పాల్గొన్నారు. **గోనెగండ్ల** మండలంలోని తిప్పనూరు గ్రామంలో గ్రామ సభలో తహశీల్దార్ కుమారస్వామి ఉచిత గ్యాస్ పథకాన్ని ప్రారంభించారు. శ్రీదుర్గా భవాని భారత్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ ఎం.రవి కుమార్, సిబ్బంది ఫయాజ్ పాల్గొన్నారు.

ఆదోనిలో గ్యాస్ పంపిణీ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న నాయకులు

గ్రామసభకు 37 దరఖాస్తులు

గ్రామంలో రీసర్వే సమస్యలపై నిర్వహించిన గ్రామసభలో వివిధ రకాల సమస్యలపై 37 దరఖాస్తులు అందినట్లు తహశీల్దార్ తెలిపారు. వీటన్నిటిని తగిన సమయంలోపు పరిష్కరిస్తామని చెప్పారు.

మంత్రాలయంలో గ్యాస్ పంపిణీ వాహనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

గోనెగండ్లలో సిలిండర్లు పంపిణీ చేస్తున్న తహశీల్దార్

ఉరుకుందలో లక్ష పుష్పార్చన

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో లక్ష పుష్పార్చనను వైభవంగా నిర్వహించారు. శుక్రవారం అమావాస్య కావడంతో స్వామివారి గర్భగుడిలో దాతలతో లక్ష పుష్పార్చన చేపట్టినట్లు డిప్యూటీ కమిషనర్ జయరాజు తెలిపారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి కుటుంబ సమేతంగా లక్ష పుష్పార్చనలో పాల్గొన్నారు. పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్, ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, వేద పండితులు, ఉప ప్రధాన అర్చకులు మహదేవ స్వామి, ముఖ్య అర్చకులు పూజన్న స్వామి, శివన్న స్వామి, ఈరన్న స్వామి పాల్గొన్నారు.

శ్మశానానికి దారి చూపండి

- సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు వీరారెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని గణేకల్లు గ్రామంలో శ్మశానానికి దారి చూపాలని సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు వీరారెడ్డి కోరారు. శుక్రవారం గణేకల్లు గ్రామంలో అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడారు. గ్రామంలో శ్మశానానికి దారి లేక ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని తెలిపారు. గతంలో దారి ఉండేదని, రైల్వే అదనపు లైన్ వేయడం వల్ల శ్మశానానికి దారి లేక రైల్వే ట్రాక్‌పై వెళ్లే పరిస్థితి దాపురించిందని చెప్పారు. గతంలో ఒకసారి మృతి చెందిన వారిని తీసుకెళ్లే సమయంలో రైలు రావడంతో ఒక వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. ఇప్పుడు కూడా రైల్వే అధికారులు అదనపు లైన్ల కోసం సర్వే చేశారని, అధికారులు స్పందించి దారి చూపించాలని కోరారు. లేకపోతే శ్మశానానికి స్థల సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బంగారయ్య, మల్లయ్య, ఎల్లప్ప పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తప్పిన పెను ప్రమాదం

- బ్రిడ్జి అంచున నిలిచిన కారు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని పాత ఫ్లైఓవర్ బ్రిడ్జిపై పెను ప్రమాదం తప్పింది. తిమ్మారెడ్డి బస్టాండ్ మీదుగా శ్రీనివాస్ భవన్ వైపు ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వచ్చే కారు అదుపు తప్పి సైడు గోడను ఢీకొట్టింది. సైడు గోడ కూలి కింద పడింది. ఆ సమయంలో బ్రిడ్జి కింద రోడ్డు వెంట ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఆ రోడ్డుపై తిమ్మారెడ్డి బస్టాండ్‌కు నిత్యం వాహనాలు, బైకులు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. దుకాణాలు ఉండడం వల్ల జనం రద్దీగా ఉండే ప్రాంతం అది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. సైడు గోడకు ఉన్న దిమ్మె వేలాడుతూ దర్శనమిచ్చింది. కారులో ఉన్నవారు ఏమాత్రం అజాగ్రత్త వహించినా కిందికి దూకి దుకాణాల్లోకి దూసుకెళ్లేదని స్థానికులు తెలిపారు. గతంలో అదే ప్రాంతంలో ట్రాక్టర్ కింద పడి పలువురికి గాయాలయ్యాయి. పురాతన ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నాలుగు చక్రాల వాహనాలకు అనుమతి ఇవ్వరాదని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే భారీ వాహనాలకు అనుమతి లేకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేశారు. సైడు గోడలు కుంగిపోయాయని, ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని, కనీసం తాత్కాలికంగా మరమ్మతులు చేయించాలని కింద జీవనం సాగించే దుకాణదారులు చెబుతున్నారు. ఇదే విషయంపై పోలీసులను వివరణ కోరగా... ప్రమాదం జరిగిన సంగతి తెలియదని, కారును తీసుకెళ్లారని తెలిపారు.

బ్రిడ్జి అంచున నిలిచిన కారు

కలిసికట్టుగా గ్రామాలాభివృద్ధి

- ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

'నేను సైతం' అంటూ ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు తెలిపారు. గురువారం మండలంలోని మాధవరం తండా గ్రామంలో దీపావళి పండగ సందర్భంగా గ్రామానికి చెందిన ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'గో గ్రీన్ 5కె రన్ మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. డీఎస్పీని, సిఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్, విజయ్ కుమార్‌ను శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు.

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ వి.రమాదేవి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళాలో శ్రీరామ్ చిట్స్ అండ్ లైఫ్ ఇన్స్యూరెన్స్, యంగ్ ఇండియా కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువత పది, ఇంటర్, ఏదైనా డిగ్రీ, చదివి ఉండాలని సూచించారు. 18-35 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. జాబ్‌మేళాలో ఎంపికయిన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.22 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాల కోసం 9010003132 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

అనాథ పిల్లలకు బాణసంచా అందజేత

చిన్నారులకు స్వీట్లు, బాణసంచా అందిస్తున్న ఆదిత్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దీపావళి పండగ సందర్భంగా పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆశ్రమంలో పేద అనాథ పిల్లలకు టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచాని సోమనాథ్ సోదరుడు మాచాని ఆదిత్య బాణసంచా అందజేశారు. శుక్రవారం పిల్లలకు, సిబ్బందికి స్వీట్లు పంచి దీపావళి పండగ జరుపుకున్నారు. పిల్లలతో కొంత సమయం గడిపి బాగా చదువుకొని భవిష్యత్తులో మంచి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. మాచాని ఆదిత్య మాట్లాడుతూ... సొసైటీ సభ్యులు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఉన్నతమైనవని కొనియాడారు. ఏ అవసరం వచ్చినా సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం సొసైటీ వ్యవస్థాపకులు సింగనేటి నరసన్నకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. డాక్టర్ మాచాని సోమనాథ్ సన్నిహితులు జె.వెంకటేష్ ప్రసన్న (టింకు), టిడిపి నాయకులు, పిఎఇఎస్ కమిటీ సభ్యులు సాతర్ల ప్రసాద్, జి.మనోహర్, శైలజ, జ్యోతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

అవ్వ, తాత కళ్లల్లో ఆనందం

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్రా రెడ్డి, ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

ప్రతినెలా 1వ తేదీ వచ్చిందంటే అవ్వ, తాత కళ్లల్లో ఆనందం కనబడుతోందని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్రా రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉరుకుంద గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు రూ.వెయ్యి పెంచడానికి జగన్ ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టిందని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.వెయ్యి పెంచి రూ.4 వేలను అందించిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పరుగులు తీస్తున్నాయన్నారు. పింఛన్లు, ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, ఇప్పుడు ఉచిత గ్యాస్ అందించడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. టిడిపి యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి, సతీష్ నాయుడు, సురేష్ నాయుడు, శివ మూర్తి, సిద్ధప్ప, రామలింగ, చిన్న, లక్కే గోవిందు, ఉరుకుంద గ్రామ నాయకులు పోతులయ్య, నర్సన్న, అయ్యప్ప, హుస్సేని, మహాదేవ నాయుడు, చిరంజీవి, తాయప్ప, కౌతాళం గిరి, రచ్చుమర్రి శివ, వీరేష్, నాగరాజు, రాగప్ప పాల్గొన్నారు.

ఉరుకుందలో పింఛన్లు పంపిణీ చేస్తున్న రాఘవేంద్రా రెడ్డి

పొట్టి శ్రీరాముల సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - ఆదోని

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా ఆదోని పట్టణ ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆవోపా అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్ గుప్తా, నాయకంటి రఘు మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం డీఎస్పీ బంగ్లా వద్ద ఉన్న మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంచిపెట్టి ఆంధ్ర రాష్ట్ర అవతరణ గురించి తెలిపారు. ఆవోపా కోశాధికారి యాతిగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు వెంకటేష్ బాబు, కుప్ప రాజేష్, వైఎం.రాఘవేంద్ర, మిరియాల బద్రినాథ్, మనోహర్ ఉన్నారు.

మొరాయించిన సర్వర్

- ఇబ్బందులు పడిన పింఛనుదారులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ నత్తనడకన సాగింది. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి మొదలైన పింఛన్ల పంపిణీ సర్వర్ మొరాయించడంతో కొంత అంతరాయం ఏర్పడింది. మొదట్లో సాఫీగా సాగినా 6.30 గంటల నుంచి సర్వర్ మొరాయించడంతో ఫేస్ మ్యాచ్, తంబ్ బయోమెట్రిక్ కోసం పలుసార్లు ఫొటో తీయాల్సి వచ్చింది. ఎక్కువసేపు నిలువలేక వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వరకు పింఛన్ల పంపిణీ ప్రక్రియ సాగింది. 1వ వార్డులో టిడిపి కౌన్సిలర్ పార్వతి సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటికి తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. 2వ వార్డులో వాల్మీకి తిమ్మప్ప సచివాలయ ఉద్యోగులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. శనివారం కూడా పంపిణీ కొనసాగుతుందని తెలిపారు.

వంద పడకల ఆస్పత్రి నిర్మించాలి

- రాష్ట్ర వైద్య, శాఖ మంత్రికి వినతి

ప్రజాశక్తి - కౌతాళం

మండలానికి 100 పడకల ఆస్పత్రి నిర్మించాలని హైకోర్టు అడ్వకేట్, బిజెపి సీనియర్ నాయకులు పురుషోత్తం రెడ్డి కోరారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ధర్మవరంలో మంత్రిని కలిసి మండలానికి 100 పడకల ఆస్పత్రి మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ... ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న పురుషోత్తం రెడ్డి

IN THE COURT OF IIND ADDL. DISTRICT JUDGE CUM MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, KURNOOL AT: ADONI

I.A. No.170/2024 in I.A.No.1079/2023 in I.A.No.353/2016 in M.V.O.P.46/2015

S. Maibub Basha & others .... **Petitioners**

Vs

K. Abdul Lateef & Another ...**Respondents**

NOTICE TO THE RESPONDENT No.1

To
K. Abdul Lateef S/o K. Khaja Hussain,
Prop:- Habeeba cotton company, Alur Road,
Adoni town, Kurnool Dist.

Whereas the above named petitioners have instituted the petition under Section 5 of Limitation Act to condone the delay in filing Restoration petition. You are hereby required to appear before this court in person or through and advocate on 07.11.2024 at 10.30 AM to answer the said petition, failing which the matter will be decided on merits.

(By court order)

B. ADISHESHAPPA,
Advocate,
H.No.5/745, M.S Nagar,
Yemmiganur 518 360
Kurnool Dist.

IN THE COURT OF IIND ADDL. DISTRICT JUDGE CUM MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, KURNOOL AT: ADONI

I.A. No. 1079/2023 in I.A.No.353/2016 in M.V.O.P.46/2015

S. Maibub Basha & others ...**Petitioners**

Vs

K. Abdul Lateef & Another ...**Respondents**

NOTICE TO THE RESPONDENT No. 1

To K. Abdul Lateef S/o K. Khaja Hussain,
Prop:- Habeeba cotton company, Alur Road,
Adoni town, Kurnool Dist.

Whereas the above named petitioners have instituted the petition under Order IX Rule 4 of CPC to Restore the I.A.No.353/2016 in MVOP No.46/2015. You are hereby required to appear before this court in person or through and advocate on 07.11.2024 at 10.30 AM to answer the said petition, failing which the matter will be decided on merits.

(By court order)

B. ADISHESHAPPA,
Advocate,
H.No.5/745, M.S Nagar,
Yemmiganur 518 360
Kurnool Dist.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) ADONI

S.O.P.No.02/2024

1. Mone Krishna
2. Mone Nagesh .... Petitioners

Vs.

To whom so ever it may concern ..... Respondent

GENERAL NOTICE

ఇందు మూలముగా యవంనందిక్ ప్రజలకు తెలియజేయదమేనగా పైన పేర్కొన్న పిటిషనర్లు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్, సబ్-రీజనల్ ఆఫీస్, కడప లో ఉన్న పిటిషన్ షెడ్యూల్ మొత్తానికి సంబంధించి పిటిషనర్లకు అనుకూలంగా వారసత్వ ధృవీకరణ పత్రాన్ని జారీ చేయడానికి పై పిటిషన్‌ను దాఖలు చేశారు. పిటిషనర్లకు అనుకూలంగా వారసత్వ ధృవీకరణ పత్రం జారీ చేయడానికి ఎవరికైనా అభ్యంతరం ఉంటే, ఈ గౌరవనీయమైన కోర్టుకు 29.11.2024 ఉదయం 10.30 గంటలకు వ్యక్తిగతంగా లేదా న్యాయవాది ద్వారా హాజరుకావాలి మరియు పేర్కొన్న పిటిషన్కు సమాధానం ఇవ్వండి, లేకుంటే విషయం స్పష్టంగా నిర్ణయించబడుతుంది.

SCHEDULE

Payment of ROC benefit amount Rs.42,100/- (Rupees Forty Two Thousand One Hundred only) is laying in Employees Provident Fund Office, Sub Regional Office, Kadapa relating to R/o PPO No.GRCDP14675/2023 of Late Mone Thayappa.

(కోర్టు ఉత్తర్వు మేరకు)

B. **ఆదిశేషప్ప,**
న్యాయవాది,
D.No.5/745, M.S. నగర్,
ఎమ్మిగనూరు-518360. కర్నూలు జిల్లా.
Cell No.9885965252

మహారాజశ్రీ డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో

E.P.No.16/2023 in O.S.No.200/2019

Y. బాలరామయ్య. ...D.Hr

-Vs-

ముంత మాధన్న చనిపోయినందు వారసులు
1) ముంత లక్ష్మమ్మ (Laxmamma)
W/o Late ముంత మాదన్న
2) ముంత మల్లికార్జున
S/o Late ముంత మాధన్న
3) ముంత మహేశ్వరి
D/o Late ముంత మాధన్న
అందరి శ్రీరంగాపురము గ్రామము, వెల్దుర్తి (మం),
కర్నూలు జిల్లా. ...J.Dr's

వేలము ప్రకటన

పై నెంబరు అమలు నందలి ఇ.పి.షెడ్యూలు దాఖాల స్థిరాస్థిని 29-11-2024వ తేదీన వేలము వేయబడును పై తేదిన ఉదయము 10.30 గంటలకు పై కోర్టువారి ఎదుట బహిరంగ వేలము వేయబడును. పై తేదిన, పై గంటలకు, పై కోర్టు నందు వేళమునకు ఏవరైన సవాలు దాఖలు ఉన్నచో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

కర్నూలు డివిజన్, డోన్ సబ్‌రిజిస్ట్రేషన్ డివిజన్ వెల్దుర్తి మండలము H/o గోవర్ధనగిరి గ్రామము, శ్రీరంగాపురము గ్రామ లిమిట్స్ in sy.No.561/2 విస్తీర్ణము 1.50 సెంట్లు (ఒక ఎకరా యాభై సెంట్లు)

హద్దులు

తూర్పు : కొండా
పడమర : రాముడు మరియు గిడ్డయ్య గారి భూమి
ఉత్తరము : నీలము రాముడు గారి భూమి
దక్షిణం : యం.లక్ష్మన్న గారి భూమి
D.Hr విలువ : 2,50,000/-
అమీన విలువ : 5,00,000/-

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వేలము వాయిదా తేది : 29-11-2024

E.Madhu Sudhan Reddy
C.Viswanath Reddy,
H.Bala Maddiah
D.Hr పరము న్యాయవాదులు,
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ : 9440588845

స్మార్ట్ మీటర్లు బిగిస్తే మరో విద్యుత్ పోరాటం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ శాఖ వారు స్మార్ట్‌మీటర్లు బిగిస్తే ప్రజలను సమీకరించి మరో విద్యుత్ పోరాటం చేస్తామని సిపిఎం నాయకులు హెచ్చరించారు. కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ దగ్గర ఉన్న సుందరయ్య భవన్ దగ్గర సిపిఎం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్యదర్శి శంకర్ అధ్యక్షతన సిపిఎం నగర కార్యదర్శి టి. రాముడు జెండావిష్కరణ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్. రాధాకృష్ణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నగేష్, నగర కార్యదర్శి టి.రాముడు, నగర కార్యదర్శి వర్గ సభ్యులుఆర్.నరసింహులు, కె.సుధాకరప్ప పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల పైన భారాలు వేయడమేపనిగా పెట్టుకునిపెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యవసరవస్తువుల ధరలు, మార్కెట్ విలువ ఆధారంగా ఇంటి పన్నులు భారాలు మొదలగు భారాలతో ప్రజలు ఊపిరాడక అల్లాడుతుంటేమూలిగేనక్కపైన తాటికాయపడిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నూతన ఎలక్ట్రిసిటీ విధానం 2020 జూన్ 25న తెచ్చిందని, రైతులకు, ప్రజలకు, స్మార్ట్మీటర్లు బిగించాలని కొత్త ఎలక్ట్రిసిటీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో 50యూనిట్లకు,100యూనిట్లకు, 150 యూనిట్లకు ఈ విధంగా కరెంటు బిల్లు యూనిట్ రేట్ చార్జీలు రేటు మారుతూ ఉండేదన్నారు. స్మార్ట్ మీటర్ విగిస్తే రీఛార్జి చేసిన సమయం దాటి ఒక్క నిమిషం కూడా ఇంట్లో కరెంటు ఉండదన్నారు. ఇల్లు చీకటిమయంగామారుతుందన్నారు. రైతులకు ఉచిత

మాట్లాడుతున్న టి.రాముడు

కరెంటు ఇస్తామని చెప్పి ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగిస్తే వారు కరెంటు బిల్లులు చెల్లించలేక వ్యవసాయాన్ని మానుకోవలసిన పరిస్థితి వస్తున్నదన్నారు. అందుకనే స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని, నూతన ఎలక్ట్రిసిటీ విధానాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని మానుకోకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున విద్యుత్ ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. సిపిఎం నగర నాయకులు కె. ప్రభాకర్, హుస్సేన్ బాష, బాస్కర్, రోశయ్య, శ్రీనివాసులు, ఇబ్రహీం, చలపతి, బాలయ్య, మురళి,రామకృష్ణ పాల్గొన్నారు.

ఏక్తా దివస్ వేడుకల్లో ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు, పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల చివరి రోజు సంధర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ జాతీయ సమైక్యతను చాటుతూ జిల్లా పోలీసు యంత్రాంగం యూనిటీ రన్‌ను కర్నూలులో ఘనంగా నిర్వహించారు. రాష్ట్రీయ ఏక్తా దివాస్ సంధర్బంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు సివిల్ , ఎఆర్, ఎపిఎస్‌పి, హోంగార్డులు, క్రీడాకారులు, విద్యార్థులు ఏక్తారన్‌లో పాల్గొన్నారు. అనంతరం ఈ ఐక్యతా పరుగు జిల్లా పోలీసు కార్యాలయం (కొండారెడ్డి బురుజు) నుండి ప్రారంభమై రాజ్ విహార్ కూడలి వరకు కొనసాగింది. ఎస్‌పి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవం లేదా రాష్ట్రీయ ఏక్తాదివస్ జరుపుకుంటారన్నారు. పటేల్ భారతదేశాన్ని ఐక్యంగా ఉంచడంలో ఆయన చేసిన కృషి గురించి అవగాహన కల్పించడమే ఈ వేడుక ప్రధాన లక్ష్యమన్నారు. భద్రత, సమగ్రత పరంగా అందరం కలిసి దేశాన్ని రక్షించుకుంటామని అక్టోబర్ 31ని ఐక్యతా దినంగా జరుపుకుంటున్నామన్నారు. దేశ సమైక్యతను, ఐక్యమత్యాన్ని కాపాడాతామని ఈ సందేశాన్ని అందరికి తెలియజేసే విధంగా అందరూ పెద్ద సంఖ్యలో యూనిటీ రన్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. దేశ ఐక్యత , సమగ్రత, భద్రతను కాపాడడానికి నన్ను నేను అంకితం చేసుకుంటానని నా తోటి వారందరిలో ఈ సందేశాన్ని వ్యాప్తి చేయడానికి తీవ్రంగా కృషి చేస్తానని నేను ప్రతిజ్ఞ చేస్తున్నానన్నారు. పటేల్

మాట్లాడుతున్న కర్నూలు ఎస్‌పి జి.బిందుమాధవ్

దార్శనికత చర్యల వల్ల సాధ్యమైన నా దేశం ఏకీకరణ స్ఫూర్తితో నేను ఈ ప్రతిజ్ఞ చేస్తున్నాను. నా దేశం అంతర్గత భద్రతను నిర్ధారించడానికి నా సొంత సహాకారం అందించాలని నేను నిర్ణయించుకున్నానని ఈపై ప్రతిజ్ఞను జిల్లా ఎస్‌పి అందరికి చదివి వినిపించారు. హోంగార్డు కమాండెంట్ సదరన్ రిజియన్ మహేష్ కుమార్, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణమోహన్, డిఎస్‌పిలు బాబు ప్రసాద్, శ్రీనివాసరావు, పోలీసువేల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, కర్నూలు పట్టణ సిఐలు, ఆర్ ఐలు, ఎస్ఐలు, ఆర్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, క్రీడాకారులు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

కోడుమూరులో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

కోడుమూరు మండల కేంద్రంలో కోడుమూరు సచివాలయం – 5లో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ ప్రోగ్రాం కింద 15 రోజులకు ఒక్కసారి ప్రజలకు ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి మందులు ఇవ్వబడుతుంది. మహిళలు, బాలింతలు, గర్భవతులు , చిన్నపిల్లలలో పౌష్టికాహార లోప నివారణ, రక్తహీనత నివారణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. రాష్ట్రంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రజల ఆరోగ్య భద్రతకు ఒక భరోసాని ఇవ్వనుంది. ఈ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత రోగనిద్ధారణ పరీక్షలు మెరుగుపడ్డాయి. షుగర్ వ్యాధి, హైటెన్షన్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నారు. గర్భవతులు, బాలింతలు ,చిన్న పిల్లలకు ఈ ప్రోగ్రాం ఎంతగానో ఉపయోగపడుతుంది. మధ్యాహ్నం నుంచి అంగన్వాడి కేంద్రానికి, స్కూళ్లను సందర్శిస్తారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన వారి ఇంటి వద్దకు వచ్చి ఉచితంగా తగిన చికిత్స, మందులు అందజేస్తారు. డాక్టర్ మదన్

శేఖర్, ఎంపి హెచ్ఓ నర్సప్ప, హెల్త్ సూపర్వైజర్ కమల్ సాహెబ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ 104 సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు సామాజిక పింఛన్లు ఓభరోసా

ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రతి నెల ఒకటో తారీకున పేదలకు సామాజిక పింఛన్లు అందించడం వారి జీవితానికి ఓ భరోసా అని ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 20వ వార్డ్ ధ్యానప్రియాహోటల్ లైన్‌లో 'ఎన్టీఆర్ భరోసా–పింఛన్ల పంపిణీ' కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం వార్డులో పలు ముఖ్యమైన కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, వార్డ్ ఇన్చార్జి పల్లె రఘునాథ్ రెడ్డి, వార్డ్ నాయకులు శ్రీకాంత్, లక్ష్మణ్, చాంద్‌బాషా, జనార్ధన్ రెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు. దొడ్డిపాడు గ్రామంలో...

పాణ్యం నియోజవర్గం కల్లూరు మండలం పెద్దటేకుర్ గ్రామ పంచాయతీ దొడ్డిపాడు గ్రామంలో నిర్వహించిన పంపిణీ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్ మహబూబ్ బాష, టి.ధనుంజయ కె రమేష్ , అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పదవులలో ఆర్యవైశ్యులకు అవకాశం

- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రభుత్వ పదవుల్లో ఆర్యవైశ్యులకు అవకాశాలు కల్పించాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వ్యాపారాలు చేసుకునే అవకాశం లేకుండా చేశారని ఆరోపించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక తప్పక న్యాయం చేస్తానని సిఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని అన్నారు. వారిమాటపై నమ్మకంతో రాష్ట్రంలోని ఆర్యవైశ్యసోదరులు ప్రతి జిల్లాలో మహాసభలు పెట్టి పార్టీకి మద్దతును కూడగట్టామన్నారు. ఒంగోలు, నర్సిపట్నంలలో ఆర్యవైశ్య సోదరులపై దాడులు జరిగితే వెళ్లి వారికి అండగా నిలబడి ధైర్యాన్నిచ్చారమన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ వైశ్య సోదరులను టిడిపికి పనిచేసేలా ప్రచారం

నిర్వహించామన్నారు. చంద్రబాబునాయుడు వల్లనే రాష్ట్రం బాగుపడుతుందనీ, పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందనీ, కొత్త కొత్త పరిశ్రమలు వస్తాయనీ ధృడంగా నమ్మి టిడిపికి ఓటేసి గెలిపించారన్నారు. అందువల్ల అలాంటి ఆర్యవైశ్యసోదరులను చంద్రబాబునాయుడు గుర్తించి వారిని ప్రోత్సాహించేందుకు పదవులలోనూ నామినేటెడ్ పదవులలోనూ సముచిత స్థానం కల్పించి వారిని మరింత ప్రోత్సాహించాలని కోరారు.

4న అన్ని సచివాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ అనే పేరుతో ప్రతి రైతుకు వ్యవసాయానికి పెట్టుబడి కొరకు ప్రతి ఒక్క రైతుకు రూ.20 వేల చొప్పున అకౌంట్లో జమ చేస్తామని చెప్పిన వాగ్దానాన్ని అమలు పరచాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 4న అన్ని సచివాలయాల కేంద్రాల్లో ధర్నా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఉన్న సచివాలయాలలో రైతు సంఘం నాయకులు నవంబర్ 4న మెమొరాండాలు సమర్పించి ధర్నా నిర్వహిస్తారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల వాగ్దానంలో భాగంగా ప్రతి ఒక్క రైతుకు వ్యవసాయానికి పెట్టుబడి సాయంగా ఒక్కొక్క రైతుకు రూ.20వేలు ఇస్తానని వాగ్దానం చేశారని, ఎన్నికలు ముగిసి నాలుగు నెలలైనా వాగ్దానం అమలు చేయలేదన్నారు.

అన్ని జిల్లాల్లోని సచివాలయాల దగ్గర మెమోరాండాలు సమర్పించేందు రైతులు నవంబర్ 4న ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు.

ఎంపిని కలిసిన జిజిహెచ్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వెంకటేశ్వర్లు కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని ఎంపి కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రిలో ని పలు అంశాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో ఎంపి చర్చించారు. వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్ని విధాలా సౌకర్యాలు కలిపించి నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు.

ఇందిరాగాంధీ సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళ్లు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పేదలకు సంక్షేమ పథకాలు దూరం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిరుపేదలకు సంక్షేమ పథకాలు అమలు కాకుండా దూరం చేస్తుందని డిసిసి అధ్యక్షుడు పి.మురళీకృష్ణ విమర్శించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతితో పాటు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు డిసిసి అధ్యక్షుడు పి.మురళీకష్ణ పూలమాలలు వేసే నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ అనేక జాతీయ సంస్థలను ఏర్పాటు చేస్తే నేడు మోడీ ప్రభుత్వం వాటిని మూసివేస్తుందన్నారు. నిరుపేద ప్రజలపై అనేక భారాలను మోపుతూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం. సుధాకర బాబు, కాంగ్రెస్ నాయకులు ఎన్సీ బజారన్న, బి .బతుకన్న, షేక్ రియాజుద్దీన్, సయ్యద్ నవీద్, కె.సత్యనారాయణ గుప్త, ఎస్ ప్రమీల, పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి - చాగలమర్రి: చాగలమర్రి పట్టణంలోని గుంతపాళెం, భూమా నగర్‌లో చేపట్టిన రోడ్డు పనులను పంచాయతీరాజ్ డిఇ వెంకటరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భూమానగర్ రూ.25 లక్షలు, గుంతపాళెం వీధిలో రూ.5 లక్షల ఉపాధి నిధులతో చేపట్టిన సిసి రోడ్డు, డ్రైనేజి నిర్మాణ పనులు చేపట్టామన్నారు. పనులలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. ఎఇ కొండారెడ్డి, రాష్ట్ర టిడిపి మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు అన్వర్‌భాష, టిడిపి నాయకులు మౌలాళి, పెద్దమహమ్మద్, నాగూర్, మహమ్మద్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

బస్సులో ప్రయాణిస్తూ శాస్వత నిద్ర

ప్రజాశక్తి-సి బెళగల్

వలసవెళ్లి స్వగ్రామానికి హైదరాబాద్ నుండి బస్సులో ప్రయాణిస్తూ నిద్రలోనే మృత్యు ఒడిలోకి చేరుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే బెళగల్ ఎస్‌సి కాలనికి చెందిన కత్తి చిన్న మల్లేష్ హైదరాబాద్ వలస వెళ్తూ ఉండే వారు. రెండు రోజుల క్రితం భార్య హనుమక్క పనిమీద సి బెళగల్ కు వచ్చింది. చిన్న మల్లేష్ కూడా రెండు రోజులు స్వగ్రామంలో ఉండి వద్దామనుకొని హైదరాబాద్‌లో నంద్యాల డిపో బస్సునుఎక్కారు. నిద్రలోకి జారుకొని కర్నూలు చేరువలో గుండె పోటుకు గురై మృత్యు ఒడిలోకి చేరుకున్నట్లు కుటుంబీకులు, బంధువులు విలపించారు. ఆయనకు భార్య హనుమక్క ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

జడ్‌పిహెచ్ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనికి చేసిన డిఇఒ

ప్రజాశక్తి వెల్దుర్తి

వెల్దుర్తి లోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్యాముల్ పాల్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినీలతో మాట్లాడుతూ పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత 100శాతం వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఆదేశించారు. అనంతరం నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం గురించి అందుకోసం కృషిచేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు గురించి డిఇఒ విద్యార్థులకు వివరించారు.

విద్యార్థినీలతో పనిచేయిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా విద్యాశాఖ అధికారి ఆకస్మిక తనిఖీకి రావడంతో ఉపాధ్యాయులు అత్యుత్సాహం ప్రదర్శించారు. డిఇఒ సమక్షంలోనే విద్యార్థినీలకు కుర్చీలు తీసుకురావాలని ఉపాధ్యాయులు చెప్పడంతో విద్యార్థినిలు సుమారు 30 కుర్చీల మేర స్కూల్లో నుంచి బయటకు తీసుకువచ్చి వేశారు. డిఇఒ చూస్తుండగానే విద్యార్థులతో పనిచేయించడం ఏమిటని అక్కడ ఉన్నవారు చర్చించుకున్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి : జి.రామకృష్ణ

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్‌లో భూములు కోల్పోయిన రైతుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామంలోని చదువుకున్న యువత రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి .రామకృష్ణ ,ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న మాట్లాడుతూ పరిశ్రమ పెట్టకముందు అప్పుడున్న ప్రభుత్వం రైతులతో మీ భూములు ఇవ్వండి మీకు నష్ట పరిహారం ఇచ్చి మీ పిల్లలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. ఇంతవరకు ఆ గ్రామంలోని చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. చట్టం ప్రకారం ఏ ప్రాంతంలోనైనా పరిశ్రమ స్థాపిస్తే ఆ ప్రాంతంలోని యువతకు 70 శాతం ముందుగా ఉద్యోగ అవకాశాలు కల్పించలన్నారు. ఇంకా మిగిలితే ఆ మండలం జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. స్టీల్ పరిశ్రమకు భూములు కోల్పోయిన రైతులకు ఇంతవరకు నష్టపరిహారం రాక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ

మాట్లాడుతున్న జి.రామకృష్ణ

ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఏమాత్రం స్పందించి రైతులకు నష్ట పరిహారం ఇప్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రాధాకృష్ణ, మహమ్మద్ బాష, శివకుమార్, బాల మద్దిలేటి ,నాగశేషులు, షేక్షావలి, సుధాకర్, నవీన్ మాలిక్, శివకుమార్ ,రామాంజనేయులు ,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

నకిలీ ఎరువులు,పిచికారి మందులు అమ్మితే చర్యలు

మండల వ్యవసాధికారి వెంకట రాముడు

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ పట్టణంలోని వివిధ ఫర్టిలైజర్ దుకాణాలు యాజమాన్యాలు నకిలీ ఎరువులు, పిచికారి మందులు అమ్మినట్లు రుజువైతే చర్యలు తప్పవని పత్తికొండ మండల వ్యవసాయ అధికారి వెంకట్ రాముడు హెచ్చరించారు. శుక్రవారం పత్తికొండలం, తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామానికి చెందిన రైతు వడ్డే నాగరాజు నకిలీ ఎరువులు అమ్మకంపై ఫిర్యాదు చేశారు. మండల వ్యవసాయ అధికారి వెంకట్ రాముడు మురళి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఆ ఎరువుల దుకాణంలో రూ.5 ,53,000 వేల విలువ గల ఎరువుల అమ్మకాలపై నిలుపుదల చేశారు. ప్రతి ఎరువుల దుకాణం నందు ధరల పట్టిక స్టాక్ బోర్డు నందు ధరల వివరాలు పొందుపరిచి ఉండాలని అన్నారు. ఎరువులు, పురుగు మందులు , విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే అమ్మాలన్నారు. రైతులు బిల్లు లేకుండా ఎరువులు ,పురుగు మందులు షాపులో కొనుగోలు చేస్తే వారిపై రాతపూర్వకంగా ఫిర్యాదు వస్తే ఖచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఫిర్యాదు చేసిన రైతు వడ్డే నాగరాజు ,వ్యవసాయ విస్తరణ అధికారి రియాజ్ బాష,శ్రీనాథ్, పాల్గొన్నారు..

ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న మండల వ్యవసాధికారి వెంకట రాముడు

కీలకమైన మొక్కల ఎదుగుదలకు రాషిన్‌బాన్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కీలకమైన మొక్కల ఎదుగుదలకు, పూత సమయంలో రైతులకు భరోసా అందిస్తున్నది ఒకే ఒక్కటీ గోద్రెజ్ రాషిన్‌బాన్ అని జిఎవిఎల్, క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ –సిఇఒ ఎన్ కె రాజవేలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరప సాగులో కీలకమైన ఆర్థిక భాగమైనందున, మిరప సాగులో పువ్వుల విజయానికి అత్యంత కీలకం అన్నారు. మొక్కల నిర్మాణాలను రక్షించే శాస్త్రీయ పరిష్కారాలను రైతులు స్వీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. . అదే సమయంలో భూసారం కోల్పోకుండా (అబియోటిక్) చూసుకోవాలి. పురుగు మందుల అశాస్త్రీయ కలయికలు పంటలను , పర్యావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని తెలిపారు. 'మిరప రైతు విజయాన్ని నిర్వచించేది పువ్వులు మీ మిరప పువ్వులను రాషిన్‌బాన్‌తో రక్షించుకోవడం చాలా ముఖ్యమని సూచించారు. . సమగ్రమైన రక్షణ అందిస్తుండటం వల్ల మిరప మొక్కలు పూత దశకు చేరుకున్నప్పుడు వినియోగానికి ఇది ప్రత్యేకంగా సిఫార్సు చేయబడిందన్నారు. . ఇప్పటికే ఉన్న గ్రాసియా ,హనాబీ ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోతో పాటు, రాషిన్‌బాన్ ను కూడా జోడించడం ద్వారా మిరప పంట మొత్తం వాల్యూ చైన్‌లో రక్షణ అందించ గలుగుతున్నాము" అని అన్నారు

పేదల అభ్యుతికి కృషి

పింఛన్ల పంపిణీలో ఎంపి బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పేద ప్రజల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి నాగరాజు మాట్లాడుతూ పింఛన్ డబ్బులను పెంచి అందిస్తుండడంతో పింఛన్ దారులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. గ్రామ టిడిపి నాయకులు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

గుంతల మయమైన ఆర్ అండ్ బి రోడ్లు

పట్టించుకోని అధికారులు -జొన్నగిరి ప్రధాన రహదారి గుత్తి పత్తికొండ రోడ్డు మరమ్మతులు చేయాలి-కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం జొన్నగిరిలో పత్తికొండ గుత్తి ప్రధాన రహదారి మరమ్మతులు తక్షణమే చేపట్టాలని తుగ్గలి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగార్జున అధికారులను కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జొన్నగిరిలో ప్రధాన రహదారి పూర్తిగా గుంతలు పడిందన్నారు. అధికారులు పూర్తిగా పట్టించుకోకపోవడంతో దీంతో రాత్రి వేళలో వాహనాలు దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా గుత్తి, పత్తికొండ ప్రధాన రహదారి గుంతల మయమంగా మారిందన్నారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అందుకు అధికారులు తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేయాలన్నారు. రోడ్లకు మరమ్మతులు చేయకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు రామకృష్ణ

సెక్యూరిటీ ఏజెన్సీని తొలగించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో భద్రతకు ఏర్పాటు చేసిన బి ఎంఎస్ సెక్యూరిటీ ఏజెన్సీని తొలగించాలని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం వర్సిటీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ భద్రత కొరకు నియమించిన సెక్యూరిటీ ఏజెన్సీ టెండర్ కాలపరిమితి ఆగస్టు 31 వతేదీకి పూర్తి అయిపోయిందన్నారు. పూర్తి అయినా కొత్త టెండర్‌ను పిలవకుండా వారినే కొనసాగించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో అర్థం కావట్లేదని అన్నారు. అలాగే నెలకు లక్షల్లో అనవసరంగా టెండర్ పూర్తి అయిన ఏజెన్సీకి ఎందుకు బిల్లులు చెల్లించాలో సమాధానం చెప్పాలన్నారు. నెలకు దాదాపుగా రూ.4లక్షలను నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీకి ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపైన ప్రత్యేకంగా కమిటీ వేసి యూనివర్సిటీ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని యూనివర్సిటీ అధికారులను కోరారు..ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మౌలాలి, సందీప్,రాజు,రమేష్,ప్రకాష్ పాల్గొన్నారు.